సాక్షి
బాపట్ల
సోమవారం । 14 । ఆగస్టు । 2023



నెమలి ఆలయానికి విరాళం

గంపలగూడెం: నెమలిశ్రీవేణుగోపాలస్వామి ఆలయం అభివృద్ధికి నెమలికి చెందిన వనమా విశ్వేశ్వరరావు, ఇందిరశ్రీలక్ష్మి దంపతులు ఆదివారం రూ.1,65,722 విరాళం ఇచ్చారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు.



దుర్గమ్మకు మంగళ సూత్రాలు

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు కాకినాడకు చెందిన భక్తులు ఆదివారం బంగారు మంగళ సూత్రాలను కానుకగా సమర్పించారు.

స్త్రీనిధి.. ఆర్థిక పెన్నిధి

జీవాలతో జీవనాధారం



నా పేరు షేక్ మాలిని. మాది నగరం మండలం చినమట్లపూడి గ్రామం. ప్రభుత్వం పొదుపు మహిళల ఉపాధి కోసం చర్యలు తీసుకుంటోంది. స్త్రీనిధి పథకం ద్వారా నాకు రూ.లక్ష రుణం మంజూరు చేసింది. ఆ సొమ్ముతో గొర్రెలు కొన్నాను. నా కుటుంబానికి ఇప్పుడు ఇవే జీవనాధారంగా మారాయి. ఆనందంగా ఉంది.

మరో నలుగురికి ఉపాధి



నా పేరు శ్రీలక్ష్మి. ఊరు చెరుకుపల్లి. మాలాంటి పేద మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. స్త్రీనిధి ద్వారా రుణం మంజూరు చేస్తోంది. నాకు రూ.లక్ష రుణం వచ్చింది. ఆ డబ్బుతో మగ్గం వర్క్ చేసే యంత్రం కొన్నా. ఇప్పుడు నేను మరో నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి వచ్చా. నా కుటుంబానికి అండగా ఉన్నా.

- దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే రుణం
- నాలుగేళ్లలో జిల్లాలో 1,07,424 మందికి ప్రయోజనం
- మహిళల స్వయం ఉపాధికి బాసట

బాపట్ల అర్బన్: పొదుపు మహిళల స్వయం ఉపాధికి స్త్రీనిధి పథకం చక్కని దారి చూపిస్తోంది. పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తోంది. జిల్లాలో 2019–20 నుంచి ఇప్పటివరకు స్త్రీ నిధి ద్వారా రుణాలు పొంది ఎందరో మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. కుటుంబాలను చక్కదిద్దుకుంటున్నారు. బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు స్త్రీనిధి పథకం ద్వారా లబ్ధి పొందిన వారు రికార్డు స్థాయిలో 1,07,424 మంది ఉన్నారు. ఇందులో 60 శాతం మంది గతంలో పని కోసం ఇతర ప్రాంతాలకు వలస పోయేవారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వీరి జీవితాల్లో మార్పు వచ్చింది. చిరు వ్యాపారులు చేతివృత్తులు చేసుకోవడంతోపాటు 750 రకాల ఉపాధి మార్గాల ద్వారా స్వయం ఆదాయం పొందుతున్నారు.

రూ.507.83 కోట్ల రుణాలు

సెర్ప్‌లో స్త్రీ నిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ వాణిజ్య బ్యాంకుల నుంచి 8 శాతం వడ్డీతో రుణాలు తీసుకొని మహిళలకు 11శాతం వడ్డీతో అప్పులు ఇస్తుంది. ఇందుకు ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ వంటివి వసూలు చేయదు. తీసుకున్న రుణాలను 36 నెలల్లో చెల్లించాలి. జిల్లాలో 2019–20 నుంచి ఈ ఏడాది జూలై 31 నాటికి రూ.507.83 కోట్ల రుణాలు మంజూరు చేసింది. రికవరీ రేటు 98 శాతం ఉండటం గమనార్హం.

గరిష్టంగా రూ.లక్షవరకు

స్వయం సహాయక సంఘాల్లో 10 మంది సభ్యులు ఉంటారు. ఒక్కొక్క సంఘానికి రూ.50వేల నుంచి రూ.ఐదు లక్షల వరకు రుణ సదుపాయాన్ని స్త్రీనిధి కల్పిస్తుంది. వ్యక్తిగతంగా రూ.లక్ష వరకు మంజూరు చేస్తుంది. 2019–20 నుంచి ఇప్పటి వరకు 32,687 స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వం చేయూత

పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్థిక చేయూత ఇస్తోంది. ఒకవైపు స్త్రీ నిధి ద్వారా రుణ సదుపాయం కల్పిస్తూనే మరోవైపు బ్యాంకుల నుంచి స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రుణాలు ఇప్పిస్తోంది. అంతేకాక 2019 ఎన్నికల నాటికి బ్యాంకులో ఉన్న పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేసి, ఆ మొత్తాన్ని విడతల వారీగా మహిళలకు చెల్లిస్తోంది. 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా 18,770 రూపాయలు అందిస్తోంది. ఇవన్నీ మహిళల స్వయం సమృద్ధికి దోహదపడుతున్నాయి.

2019-20 నుంచి స్త్రీ నిధి రుణాలు ఇలా..

సంవత్సరం	రుణ గ్రహీతాలు	మంజూరు చేసిన మొత్తం (రూ.కోట్లలో)
2019–20	1,8027	89.84
2020–21	1,7010	86.02
2021–22	31,344	122.34
2022–23	32,418	149.00
2023–24 ఇప్పటివరకు	8,625	60.63

డీఆర్డీఏ సిబ్బందికి ప్రోత్సాహకాలు

స్త్రీనిధి ద్వారా రుణాలు ఇప్పించి మహిళల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే డీఆర్డీఏ–వైకేపీ సిబ్బందికి ప్రత్యేక ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి. స్త్రీనిధి బ్యాంకు వసూలు చేసే వడ్డీలో ఒక శాతం ప్రోత్సాహకాల కోసం వెచ్చిస్తుంది. అలాగే స్త్రీనిధి సభ్యత్వం కలిగి షేర్ క్యాపిటల్ కలిగిన ప్రతి మండల సమైక్యకు రూ.75 వేల చొప్పున డివిడెండ్ చెల్లిస్తుంది. 2022–23 సంవత్సరానికి సంబంధించి డివిడెండ్ త్వరలోనే ఇవ్వడానికి స్త్రీ నిధి బ్యాంక్ చర్యలు చేపట్టింది. అలాగే స్త్రీనిధి బ్యాంకు మహిళలు తీసుకునే రుణాలకు బీమా సదుపాయం కల్పిస్తోంది. రుణం తీసుకున్న పొదుపు మహిళ మరణిస్తే ఒక రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఇదిలా ఉంటే స్త్రీనిధి రుణాల వడ్డీ రేటును తొమ్మిది శాతానికి తగ్గించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

వలసలు తగ్గాయి



బాపట్ల జిల్లా నుంచి గతంలో వలసలు ఎక్కువగా ఉండేవి. ఫలితంగా ప్రభుత్వం స్త్రీనిధి రుణాల మంజూరుపై దృష్టిపెట్టింది. ఆ రుణాల ద్వారా మహిళలకు స్వయం ఉపాధి మార్గాలను చూపే విషయంపై శ్రద్ధ పెట్టింది. ఇది సత్ఫలితాలనిస్తోంది. ప్రస్తుతం జిల్లా నుంచి వలసలు గణనీయంగా తగ్గాయి. స్త్రీనిధి బ్యాంకుకు ప్రత్యేక యాప్ ఉంది. దానిలో దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లోనే రుణం మంజూరవుతుంది.

– బొంత అర్జున్ కుమార్,
డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాపట్ల జిల్లా

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర దినోత్సవ పరేడ్ రిహార్సల్స్ అదుర్స్

ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రశంసలు



నరసరావుపేట: సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ క్రీడా ప్రాంగణంలో ఈనెల 15న నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల పరేడ్ రిహార్సల్స్‌ను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం చేసిన అనంతరం అదనపు ఎస్పీ(ఏఆర్) డి.రామచంద్రరాజు పర్యవేక్షణలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ సూచనల మేరకు నరసరావుపేట సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కేవీ మహేష్ పరేడ్ కమాండర్‌గా ఎస్పీకి గౌరవ వందనం చేశారు. రిహార్సల్స్ అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల ప్రదర్శనను ప్రశంసించారు. అందరూ సమన్వయంతో ఆగస్టు 15న కూడా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్తికేయుని సేవలో ప్రముఖులు



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దేవదాయ ధర్మదాయ శాఖ కాకినాడ డెప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ శంకర్ నారాయణ కుటుంబ సమేతంగా విడివిడిగా ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వారు నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

కృష్ణా డెల్టాకు 7,000 క్యూసెక్కుల సాగునీరు



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు 7,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ విక్రమ్ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 30.1200 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు 36 టీఎంసీల వరకు నీటిని నిల్వ ఉంచామని వివరించారు. అయితే రోజూ డెల్టాకు నీటిని వదలడంతో ఆరు టీఎంసీలు తగ్గినట్లు చెప్పారు. గత నాలుగేళ్లుగా ఆగస్టు ఆఖరు నాటికి ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యంతో అంటే 45.77 టీఎంసీలు నిల్వ ఉంచుతూ వచ్చామని వెల్లడించారు. ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు కురవకపోవడం, సాగర్ నుంచి నీరు విడుదల కాకపోవడంతో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ ఉంచలేకపోయినట్లు వెల్లడించారు.

శ్రీవైఖానస సంఘాల సమావేశం



మంగళగిరి: నగరంలోని రాజీవ్ సెంటర్‌లోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్ర ప్రాంతీయ వైఖానస సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భువనేశ్వరి పీఠం కమలానంద భారతీ స్వామి వైఖానస మహర్షి వైభవాన్ని అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో టీటీడీ దేవస్థాన ప్రధాన అర్చకులు అర్చకం వేణుగోపాల్ దీక్షితులు, డాక్టర్ గంజాం రామకృష్ణ, డాక్టర్ తనోజ్ విష్ణు వర్ధన్, రొంపిచెట్ల సింగరాచార్యులు, ఖండవల్లి నారాయణం విజయలక్ష్మి, గుడిపూడి రాధికారాణి, పరాశరం శేషకుమారి, నల్లూరు మోహన రంగా చార్యులు, దీవి నరసింహ దీక్షితులతోపాటు అనేక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



నరసరావుపేట రూరల్: ఆప్కాస్‌లో విలీనమైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆదివారం లింగంగుంట్ల కాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో పనిచేస్తున్న 1,431 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేసినట్టు వివరించారు. ఉద్యోగులు మాట్లాడుతూ 1,431 కుటుంబాల్లో సీఎం ఆనందం నింపారని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన ఆప్కాస్ సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కారెంపూడి: చిన్నిచిన్ని నవ్వులతో.. ముద్దుముద్దు మాటలతో అప్పటివరకు సందడి చేసిన ఆ చిన్నారి అంతలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. నీటి బకెట్‌లో పడి మృత్యుఒడికి చేరాడు. కన్నతల్లికి కడుపుకోత మిగిల్చాడు. ఈ హృదయ విదారక ఘటన స్థానిక మాచర్ల రోడ్డులో జరిగింది. దాచేపల్లి మండలం గామాలపాడుకు చెందిన వివాహిత తన కుమారుడు వరుణ్(2)తో కలిసి కారెంపూడి మాచర్ల రోడ్డులో ఉంటున్న మేనమామ నారాయణ ఇంటికి వచ్చింది. వరుణ్ ఇంట్లో ఆడుకుంటూ ఉండడంతో తల్లి ఇంటి పనుల్లో నిమగ్నమైంది. బాలుడు ఆడుకుంటూ నీటి బకెట్ వద్దకు వెళ్లి అందులో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో ఉండిపోయాడు. కొద్దిసేపటి తర్వాత చూసిన కుటుంబ సభ్యులు బాలుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఆస్పత్రి నుంచి బాబు మృతదేహాన్ని గామాలపాడుకు తీసుకెళ్లారు. బాబు తండ్రి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు.

కోర్సుల కోలాహలం

- సాకారమైన దశాబ్దాల స్వప్నం
- ఏఎన్‌యూలో బీఏఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ కోర్సులు
- అనుమతి మంజూరు చేసిన బీసీఐ
- ఈ విద్యా సంవత్సరం నుంచే నిర్వహణ
- గత పాలకుల నిర్లక్ష్యంతో పదేళ్లుగా పెండింగ్‌లోనే..



ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రధాన ద్వారం

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డిగ్రీ స్థాయిలో న్యాయశాస్త్ర కోర్సులను ప్రారంభించాలన్న పదేళ్ల స్వప్నం ఇన్నాళ్లకు సాకారమవుతోంది. పలు కారణాలతో ఏఎన్‌యూలో డిగ్రీ స్థాయిలో న్యాయశాస్త్ర కోర్సులను ఇరవై ఏళ్ల క్రితం రద్దు చేశారు. ఆ తరువాత న్యాయశాస్త్ర కోర్సులకు పెరిగిన డిమాండ్, మారుతున్న పరిస్థితులకనుగుణంగా మళ్లీ డిగ్రీ స్థాయిలో లా కోర్సులను ప్రారంభించాలని పదేళ్ల క్రితమే చర్యలు చేపట్టారు. అయితే గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటివరకు ఫలించలేదు. ప్రస్తుతం సాకారం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పూర్వ విద్యార్థుల సంఘం వినతితో..

ఏఎన్‌యూలో ఎల్ఎల్‌బీ కోర్సులను మళ్లీ ప్రారంభించాలని న్యాయశాస్త్ర పూర్వ విద్యార్థుల సంఘం పలుమార్లు యూనివర్సిటీ ఉన్నతాధికారులకు విన్నవించింది. దీంతో ప్రస్తుతం మంచి డిమాండ్ ఉన్న రంగాలకు అనుసంధానంగా లా కోర్సులను నిర్వహిస్తే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ కోర్సుల నిర్వహణకు యూనివర్సిటీ స్థాయిలో అన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసి బీసీఐ(బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)కు పంపింది.

సెల్ఫ్‌ఫైనాన్స్ విధానంలో నిర్వహణ

యూనివర్సిటీలో బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ కోర్సుల నిర్వహణకు బీసీఐ అనుమతి మంజూరు చేయడంతో 2023–24 విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సులకు ప్రవేశాలు నిర్వహించనున్నారు, సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో ఈ కోర్సులకు ఒక్కో సెమిస్టర్‌కు రూ.25 వేలు ఫీజుగా నిర్ధారించారు. ఒక్కొక్క కోర్సులో 60 సీట్లు ఉంటాయి. కొత్త కోర్సులకు బీఓఎస్(బోర్డ్ ఆఫ్ స్టడీస్) చైర్మన్‌గా ఏఎన్‌యూ న్యాయశాస్త్ర విశ్రాంత అధ్యాపకులు ఆచార్య ఎస్.రంగయ్యను నియమించారు.

విశ్రాంత అధ్యాపకులు, న్యాయమూర్తులతో బోధన

కొత్తగా అందుబాటులోకి తెస్తున్న కోర్సులకు ఏఎన్‌యూ న్యాయశాస్త్రంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఆచార్య వై.ఆర్.హరగోపాల్‌రెడ్డి, ఆచార్య ఎస్.రంగయ్యతోపాటు పలువురు విశ్రాతం అధ్యాపకులు, సుప్రీంకోర్టు, హైకోర్టులలో పని చేసిన విశ్రాంత న్యాయమూర్తులతోపాటు పలువురు న్యాయశాస్త్ర నిపుణులు పాఠ్యాంశాలు బోధించనున్నారు. ఏఎన్‌యూలో ఎల్ఎల్‌బీ కోర్సులు ప్రారంభిస్తే తాము సేవలు అందించేందుకు సిద్ధమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో పాటు పలువురు విశ్రాంత న్యాయమూర్తులు ఇటీవల జరిగిన ఏఎన్‌యూ లా పూర్వ విద్యార్థుల సమావేశంలో ప్రకటించారు.

ప్రత్యేక వసతులు

న్యాయశాస్త్ర కోర్సుల కోసం ప్రత్యేక మౌలిక వసతులను యూనివర్సిటీ ఉన్నతాధికారులు అందుబాటులోకి తెచ్చారు. లా కోర్సులన్నింటినీ కలిపి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ విభాగంగా ఏర్పాటు చేశారు. అత్యాధునిక హంగులతో భవనాన్ని అందుబాటులోకి తెచ్చారు. 5 వేలకుపైగా పుస్తకాలతో లైబ్రరీని సిద్ధం చేశారు.

వసతులు కల్పించని గత పాలకులు

ఏఎన్‌యూలో బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ కోర్సుల ప్రారంభానికి పదేళ్ల క్రితమే చర్యలు ప్రారంభించారు. బీసీఐకి ప్రతిపాదనలూ పంపారు. బీసీఐ బృందం ఏఎన్‌యూలో పర్యటించి మౌలిక వసతులు, అధ్యాపకులు లేరని స్పష్టం చేసింది. కానీ అప్పటి పాలకులు ఈ కోర్సుల ప్రారంభానికి నిర్దిష్టమైన చర్యలు చేపట్టకపోవడంతో ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉంది. ప్రస్తుత ప్రభుత్వం బీసీఐ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టడంతో అన్ని అనుమతులూ మంజూరయ్యాయి.

అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన



ఏఎన్‌యూలో బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ కోర్సులను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహిస్తాం. వ్యాపార, వాణిజ్య రంగాలతోపాటు ఇతర రంగాలలో ఇప్పుడు న్యాయశాస్త్ర నిపుణుల సేవలు ఎంతో కీలకంగా మారాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ కోర్సులను ప్రారంభిస్తున్నాం. ఈ కోర్సులు చదివిన వారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విశ్రాంత న్యాయమూర్తులు పాఠాలు బోధించనున్నారు.

– పి.రాజశేఖర్, వీసీ, ఏఎన్‌యూ

ట్రాక్టర్ బోల్తా ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో ఒకరు నాలుగేళ్ల బాలుడు, మరొకరు వృద్ధుడు
- దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా దుర్ఘటన



కాలువలో పల్టీ కొట్టిన ట్రాక్టర్





మృతి చెందిన సుదర్శన్ ప్రసాద్, చిన్నారి రుత్విక్ షన్విక్

చెరుకుపల్లి: ఆనందంగా అమ్మవారి గుడికి వెళ్లి మొక్కు తీర్చుకుని ట్రాక్టర్‌లో తిరిగి వస్తుండగా దారి కాచిన మృత్యువు ప్రమాదరూపంలో ఇద్దరిని కబళించింది. వీరిలో ఒకరు నాలుగేళ్ల బాలుడు కాగా, మరొకరు వృద్ధుడు. ఈ హృదయ విదారక ఘటన కుంచాలవారిపాలెం ఇంటూరు మార్గంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చుండూరు మండలం మున్నంగివారి పాలెంకు చెందిన 13 మంది ఆదివారం ఉదయం కర్లపాలెం మండలం యాజలిలోని అంకమ్మ తల్లి గుడికి ట్రాక్టర్‌లో వెళ్లి మొక్కుబడులు తీర్చుకొని సాయంత్రం స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. కుంచాలవారి పాలెం ఇంటూరు రహదారిలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న పంట కాలువలో ట్రాక్టర్ బోల్తా కొట్టింది. అందులో ఉన్న వారంతా ట్రక్కు కింద నీటిలో పడిపోయారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న రేపల్లె రూరల్ సీఐ ఎ.శివశంకర్ ప్రమాదాన్ని గమనించి స్థానికుల సాయంతో ట్రాక్టర్ కింద పడిపోయిన వారిని బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ పక్కనే కూర్చొన్న సుదర్శన్ ప్రసాద్ (60) అక్కడికక్కడే మృతి చెందాడు. గుంటూరు రుత్విక్ షన్విక్(4) అనే బాలుడు కాలువలో నీరు తాగి అపస్మారకస్థితికి చేరడంతో పిట్టలవానిపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు కావటంతో తెనాలి ఏరియా హాస్పిటల్‌కు 108 సాయంతో తరలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు, రుత్విక్ షన్విక్ భౌతికకాయాన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు, మృతిచెందిన ప్రసాద్ చుండూరు యూనియన్ బ్యాంక్‌లో గోల్డ్ అప్రైజర్. రుత్విక్ షన్విక్ ట్రాక్టర్ డ్రైవర్ కొసన అంకమ్మరావు కూతురు కొడుకు. చెరుకుపల్లి, అమృతలూరు, చుండూరు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, రేపల్లె, బాపట్ల డీఎస్పీలు, టి.మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, రేపల్లె, చుండూరు సీఐలు, శివశంకర్, రామ్మోమోహన్ ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు.

11 మంది ప్రాణాలు కాపాడిన సీఐ శివశంకర్

ప్రమాదాన్ని గమనించిన రేపల్లె రూరల్ సీఐ ఎ.శివశంకర్ సకాలంలో స్పందించి 11 మంది ప్రాణాలు కాపాడారు. ఆయన పొలాల్లో పని చేసేవారిని, ఆ మార్గంలో వెళ్లే ఆటోవాళ్లను ఆపి ట్రాక్టర్ కింద చిక్కుకున్న బాధితులను బయటకు తీసుకువచ్చారు. వీరిలో 8 మంది మహిళలు, ఓ ఆరేళ్ల చిన్నారి ఉన్నారు. చిన్నారితోపాటు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని 108 సాయంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాణాలు కాపాడారు.

జయ శారదా ని'కేతనం'

శతాధిక కీర్తిపతాక

- స్వాతంత్య్రోద్యమ కాలంలో నెలకొల్పిన సరస్వతీనిలయం
- మహాత్మాగాంధీ అడుగుపెట్టిన పవిత్రస్థలం
- 101 ఏళ్లు పూర్తిచేసుకున్న విద్యాలయం





ఉన్నవ లక్ష్మీనారాయణ   లక్ష్మీబాయమ్మ (ఫైల్)



శారదా నికేతన్



గాంధీ గడిపిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటం, జాతీయ జెండాలు

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రిటిష్ పాలకులను ఎదిరించి జైలు శిక్షనూ అనుభవించిన స్వాతంత్య్ర సమర యోధులు ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతుల చేతుల మీదుగా రూపుదిద్దుకున్న అక్షర వేదిక.. వందేళ్ల క్రితమే మహిళా సాధికారత, స్త్రీ విద్య ప్రాధాన్యాన్ని చాటిచెప్పిన సమరగీతిక.. గుంటూరు శారదా నికేతన్. ఈ విద్యాలయం ఏర్పడి ఇప్పటికి 101 ఏళ్లు పూర్తవుతోంది. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 76 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ చారిత్రక సరస్వతీనిలయం గురించి ఓసారి మననం చేసుకుందాం.

1922లో నెలకొల్పిన శారదా నికేతన్ అంచెలంచెలుగా ఎదిగి మహిళా విద్యకు చిరునామాగా నిలిచింది. స్వతహాగా రచయిత అయిన ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన మాలపల్లి నవల అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. ఆ నవలను బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. దేశ వ్యాప్తంగా సహాయ నిరాకరణ ఉద్యమం సాగుతున్న కాలంలో మహాత్మా గాంధీ గుంటూరు పట్టణానికి వచ్చినప్పుడు బ్రాడీపేట 2/14లో ఉన్న శారదా నికేతన్‌ను సందర్శించారు. ఐదు రోజులపాటు అక్కడే బస చేశారు. ఆ ప్రాంగణంలోని మర్రిచెట్టు కింద కూర్చుని, అక్కడే ఉన్న బావి వద్ద రోజూ స్నానం చేసేవారు. సహాయ నిరాకరణ ఉద్యమానికి మద్దతుగా ప్రజలను చైతన్యపర్చేందుకు మర్రిచెట్టునే ఆయన వేదికగా చేసుకుని స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. గాంధీ గుంటూరు పర్యటన ముగించుకుని వెళ్లే సమయంలో ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతులు మహాత్మునితో కలిసి అడుగులు వేశారు. ఆనాడు మహాత్మునికి నీడను ఇచ్చిన మర్రిచెట్టు కాలగమనంలో భారీ వర్షాలకు వేళ్లతో సహా నెలకొరిగింది. ఆయన స్నానమాచరించిన బావి కూడా పూడుకుపోయింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని ఆనాడు మర్రిచెట్టు, బావి ఉన్న ప్రదేశాలను ఒక సర్కిల్‌గా ఏర్పాటు చేసి మహాత్మా గాంధీ చిత్రపటాన్ని, జాతీయ జెండాలతో అధికారులు అలంకరించారు. ఘన చరిత్ర కలిగిన శారదా నికేతన్ శతాబ్ది ఉత్సవాలను గతేడాది ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శారదా నికేతన్ మహిళా విద్యా సంస్థలను విద్యాశాఖ పరిధిలోకి తెచ్చిన ప్రభుత్వం, సంస్థల అభివృద్ధికి కృషి చేస్తోంది.

క్లుప్తంగా

గుండెపోటుతో లారీడ్రైవర్ మృతి



అద్దంకి రూరల్: బహిర్భూమికి వెళ్లిన లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈఘటన శనివారం అర్ధరాత్రి జరగ్గా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ప్రవీణ వివరాల మేరకు.. చెన్నైకి చెందిన లారీ డ్రైవర్ మురళీ (53) ఆయిల్ ట్యాంక్ లారీని హైదారాబాద్ నుంచి చెన్నైకు తీసుకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలో శ్రీనివాసనగర్ సమీపంలోకి రాగానే లారీని రోడ్డు మార్జిన్‌లో ఆపి బహిర్భూమికి వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందినట్లుగా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కృష్ణాజిల్లా వాసిగా గుర్తింపు



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన కర్లపాలెం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు కర్లపాలెం వైపు నుంచి చందోలు వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని తిమ్మారెడ్డిపాలెం సమీపంలో గల సతీష్ మెరైన్ వద్ద ఎదురుగా వచ్చిన ఓ ఎస్‌యూవీ ఢీకొట్టింది. ఘటనలో కృష్ణా జిల్లా పామర్రు మండలం జమీదగ్గుమిల్లి గ్రామానికి చెందిన గుడివాడ సాయి బాలాజీ తీవ్రంగా గాయపడి, ఆస్పత్రికి తరలించేలోపు మరణించాడు. అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతుడిని గుర్తించారు. ఈమేరకు కర్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- పేదలు ఆర్థికంగా ఎదగడం చంద్రబాబుకు ఇష్టంలేదు
- పెత్తందారులు, భూస్వాములకు అండగా నిలుస్తున్న చంద్రబాబు
- వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాల వ్యాఖ్యలు దుర్మార్గమైనవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

నగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే చూసి ఓర్వలేక తాను అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని చంద్రబాబు చెబుతున్నాడని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని పూడివాడ శివారు కాసానివారి పాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. పెత్తందారులు, భూస్వాములకు అండగా నిలవడం, పేద ప్రజలను విస్మరించడం చంద్రబాబుకు అలవాటేన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలు సోమరిపోతులుగా మారుతున్నారని చంద్రబాబు, అచ్చెంనాయుడులు అనడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రతిపక్షాలు ఉనికిని కాపాడుకునేందుకే వలంటీర్ వ్యవస్థపై దుర్మార్గమైన వాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకు చేరుతున్న సంక్షేమ పథకాల వల్ల పేదవారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంటే ఆ పథకాలను అడ్డుకుని పేదల బతుకుదెరువుపై దెబ్బకొడుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేకూర్చేలా చంద్రబాబు ఒక్క సంక్షేమ పథకమైనా ప్రవేశపెట్టారా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అడ్డుకుంటే చంద్రబాబు పేదల వ్యతిరేకిగా సమాజంలో మిగిలిపోతారన్నారు. గ్రామాలలో ప్రతి గడపకు వెళ్లినప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో సుఖ సంతోషాలతో జీవిస్తున్నామని ప్రజలు చెబుతున్నారని ఆ పథకాలే రానున్న ఎన్నికలలో తమను గెలిపిస్తాయన్నారు. పేదలు ఆర్థికంగా ఎదగడం చంద్రబాబుకు ఇష్టంలేదని, కాబట్టే సంక్షేమ పథకాలు రద్దు చేస్తానని అంటున్నారని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుంటే ప్రతిపక్ష నాయకులు అందడం లేదని అర్థం పర్థం లేని ఆరోపణలే చేయడం అనైతికమన్నారు. దమ్ముంటే ప్రతిపక్ష నాయకులు గ్రామాలలోని ప్రజలకు దగ్గరకు రావాలని ఎంపీ మోపిదేవి సవాల్ విసిరారు. సమావేశంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, మోపిదేవి రాజీవ్ పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన గోపాలకృష్ణ

చినగంజాం: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన చినగంజాం 216 జాతీయ రహదారిపై ఫ్లెఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చీరాలకు చెందిన నల్లమోతు గోపాలకృష్ణ (37) ఒంగోలులోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం గోపాలకృష్ణ ఒంగోలు నుంచి చీరాల వెళ్తుండగా చినగంజాం ఫ్లైఓవర్ వద్దకు రాగా చీరాల నుంచి ఒంగోలు వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గోపాలకృష్ణ మృతి చెందగా ఒంగోలుకు చెందిన నిమ్మగడ్డ సోమయ్య, వెనిగండ్ల వెంకటేశ్వర్లు గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భద్రత కట్టుదిట్టం



ట్రయల్‌రన్‌లో భాగంగా గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ రాణా

విజయవాడ స్పోర్ట్స్: ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. స్టేడియంలో జరుగుతున్న స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. అనంతరం నిర్వహించిన ట్రయల్ రన్‌లో భాగంగా జాతీయ జెండా వందనం, పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శన, పోలీస్ బ్యాండ్‌ను పరిశీలించారు. ఈ నెల 15వ తేదీన నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వెయ్యి మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ రాణా తెలిపారు.

వర్షాల కోసం కప్పలకు పెళ్లి



కప్పల జంటను ఊరేగిస్తున్న దృశ్యం

అద్దంకి: సంప్రదాయాలు, ఆచారం, కట్టుబాట్లు ఇంకా గ్రామాల్లో అక్కడక్కడ కనిపిస్తుండటం మన దేశ సంస్కృతి చిహ్నం. వర్షాల కోసం కప్పలకు పెళ్లి చేశారు బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని కొప్పరం గ్రామస్తులు. ఈ కార్యక్రమం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా రెండు కప్పలకు పెళ్లి చేసి, కావడికి కట్టుకుని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమాన్ని ఆసక్తిగా గ్రామస్తులంతా చూశారు. కప్పలకు పెళ్లి చేస్తే వర్షాలు పడతాయనే నమ్మకంతో ఇలా చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ఇద్దరి ప్రాణాలను కాపాడిన మెరైన్ పోలీసులు



యువకుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ సుబ్బారావు

చీరాల టౌన్: స్నేహితులతో సరదాగా గడిపేందుకు కర్నూలు నుంచి వాడరేవుకు వచ్చిన మిత్ర బృందంలో ఇద్దరు యువకులు అలల తాకిడికి గురై సముద్రంలో కొట్టుకుపోతుండగా మెరైన్ పోలీసులు తమ ప్రాణాలకు తెగించి యువకుడి ప్రాణాలను కాపాడారు. ఈఘటన ఆదివారం రామాపురం సముద్రతీరంలో చోటు చేసుకుంది. మెరైన్ ఎస్ఐ పసుపులేటి సుబ్బారావు వివరాల మేరకు.. రామాపురంలోని ఓ రిసార్ట్ సమీపంలో కర్నూలు నుంచి సముద్ర తీర ప్రాంతానికి ఐదుగురు మిత్రులు వచ్చారు. మిత్ర బృందంలో పుల్లేటి మహేష్, గోగుల రమణ సముద్రంలో స్నానాలు చేస్తుండగా అలల తాకిడికి గురై సముద్రంలో కొట్టుకుపోతుండగా తీరం ఒడ్డున విధులు నిర్వహిస్తున్న మెరైన్ పోలీస్ కానిస్టేబుళ్లు గణేష్, ఎం.వెంకటేశ్వర్లు తన ప్రాణాలకు తెగించి అలల తాకిడికి గురైన యువకులను రక్షించారు. సెలవు రోజుల్లో వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంతాలకు పర్యాటకులు అధికంగా వస్తున్నందున మెరైన్, సివిల్ పోలీసులు విధిగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలీసులు సకాలంలో స్పందించపోతే రెండు ప్రాణాలు సముద్రంలో కలిసిపోయేవని, తమ ప్రాణాలకు కాపాడిన కానిస్టేబుళ్లు గణేష్, వెంకటేశ్వర్లుతో పాటు మెరైన్ సిబ్బందికి స్నేహితుల బృందం కృతజ్ఞతలు తెలిపింది. సకాలంలో స్పందించిన మెరైన్ పోలీసుల తీరును పర్యాటకులు హర్షించారు.

అండర్-13 ఫుట్‌బాల్‌లో బాపట్లకు రెండో స్థానం

రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత

చీరాల రూరల్: నల్లమల జోనల్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్స్ అండర్-13 బాలుర ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్ షిప్–2023 పోటీలు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించారు. పోటీల్లో బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జట్టు క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు బాపట్ల జిల్లా కో-ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు తదుపరి జరిగే రాష్ట్రస్థాయి పాల్గొంటారని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ట్రెజరర్ విజయ్ తెలిపారు. పోటీలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ హాజరయ్యారని చెప్పారు. ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య, కోచ్‌లు యు.ప్రసన్న, దేవదానం పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను పలువురు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వరుస సెలవుల నేపథ్యంలో పెరిగిన భక్తుల తాకిడి



ఆదిదంపతుల ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండో శనివారం, ఆదివారంతో పాటు మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భక్తుల సంఖ్య అధికంగా కనిపిస్తోంది. వరుస సెలవుల నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కనిపించింది. ఆది దంపతులను దర్శించుకునేందుకు తరలి వచ్చిన భక్తులతో పాటు ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు సైతం ఉభయదాతలు ఆసక్తిని చూపుతున్నారు. దీంతో ఖడ్గమాలార్చనతో పాటు లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

లోక కల్యాణార్థం సూర్యోపాసన సేవ....

లోక కల్యాణార్థం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. సేవలో పాల్గొన్న ఉభయ దాతలు, భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

క్యూలైన్లను పర్యవేక్షించిన చైర్మన్, ఈఈ...

భక్తుల రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు క్యూలైన్లను పర్యవేక్షించారు. రూ.100 క్యూలైన్‌లో భక్తులు అధికంగా ఉండటంతో వారికి రూ. 300 క్యూలైన్‌లోకి మళ్లించి రెండు క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో పంపిణీ చేస్తున్న ఉచిత ప్రసాదంతో పాటు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు, భక్తులు, పలువురు ప్రముఖులు విశేషంగా పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈసీ మెంబర్‌గా రమేష్



అద్దంకి: ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఈసీ మెంబర్‌గా తనను ఎన్నిక చేసినట్లు అద్దంకి ఫారెస్ట్ బీట్ అధికారి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవిని ఇచ్చినందుకు ఏపీజీఈఎఫ్ రాష్ట్ర కమిటీ చైర్మన్, కాకర్ల వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ కమిటీ అభివృద్ధికి పాటుపడతానని, సభ్యుల సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ధర్మప్రచార జాతీయ కమిటీలో ‘స్వర్ణ’ వాసి



కారంచేడు: అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార జాతీయ కమిటీలో మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన తిరుమలశెట్టి హరిబాబుకు స్థానం లభించింది. గతంలో ఆయన ఉమ్మడి ప్రకాశం జిల్లా అఖిల భారత ప్రచార కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. ఆదివారం విశాఖపట్నంలో జగిన జాతీయ సమావేశంలో హరిబాబును నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. స్వర్ణ గ్రామస్తులు, అయ్యప్పలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యాక్టరీపై నుంచి పడి కార్మికుడు దుర్మరణం



మేదరమెట్ల: ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి కార్మికుడు మృతి చెందాడు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల తమ్మవరం రోడ్డులో గల సింథైట్ కారం ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కొత్తపల్లి దూదిస్తే (30) ఆదివారం ఫ్యాక్టరీ పైనుంచి పడి దుర్మరణం పాలయ్యాడు. అందిన సమచారం మేరకు.. శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం హరిపురానికి చెందిన కొత్తపల్లి దూదిస్తే గత కొంతకాలంగా మేదరమెట్లలోని సింథైట్ కారం ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే ఫ్యాక్టరీకి వెళ్లిన దూదిస్తే యాజమాన్యం ఫ్యాక్టరీ లోపల పైకప్పు వద్ద పక్షి గూళ్లు ఉన్నాయని వాటిని తొలగించాలని చెప్పడంతో పైకి ఎక్కాడు. కాలిజారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కార్మికుడిని ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

జొన్నలగడ్డలో ‘వ్యూహం’ షూటింగ్



ఓదార్పు యాత్ర సన్నివేశం

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో వ్యూహం సినిమా షూటింగ్ ప్రజలను ఆకట్టుకుంది. ప్రముఖ చిత్ర దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత దాసరి కిరణ్ నిర్మాణంలో శరవేగంగా చిత్రం రూపొందుతుంది. జొన్నలగడ్డ గ్రామంలో ఓదార్పుయాత్ర, స్థానిక ప్రజలతో సమావేశం, ప్రజల సమస్యలు తెలుసుకునే సన్నివేశాలను చిత్ర హీరో అజ్మల్‌పై చిత్రీకరించారు. తమ గ్రామంలో చిత్ర షూటింగ్ జరగడంతో గ్రామస్తులు, సమీప గ్రామ ప్రజలు తండోపతండాలుగా షూటింగ్ జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సన్నివేశాలను చిత్రీకరించారు. ఆనాడు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలతో మమేకమైన జగనన్న తీరును కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారు.

సెక్రటరీస్ లెవెన్‌పై ప్రెసిడెంట్స్ లెవెన్ విజయం

మంగళగిరి: నవులూరు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఏసీఏ అండర్ -19 ఉమెన్ ఇంటర్‌జోనల్ వన్డే మ్యాచ్‌లో సెక్రటరీస్ లెవెన్ జట్టుపై ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు 57 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 190 పరుగులు సాధించింది. జట్టు బ్యాటర్ సీహెచ్ తమన్నా 41 బంతుల్లో, 9 ఫోర్లతో 47 పరుగులు సాధించగా, మరో బ్యాటర్ ఎండీ జక్రా మేహక్ 92 బంతుల్లో 5 ఫోర్లతో 42 పరుగులు చేసింది. సెక్రటరీస్ లెవెన్ బౌలర్ శ్రీస్థి శేఖర్ అయిదు ఓవర్లలో 14 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టగా, మరో బౌలర్ పి.రంగలక్ష్మి రెండు ఓవర్లలో ఆరు పరుగులిచ్చి ఒక వికెట్‌ను పడగొట్టింది. అనంతరం 191 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సెక్రటరీస్ లెవెన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటై 57 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. సెక్రటరీస్ లెవెన్ జట్టు బ్యాటర్ ఎం.అంజుమ్ 120 బంతుల్లో రెండు ఫోర్లతో 30 పరుగులు చేసింది. ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు బౌలర్ ఎం.అక్షిత 7 ఓవర్లలో 21 పరుగులిచ్చి 3 వికెట్లు సాధించగా మరో బౌలర్ కె.హారిక 8 ఓవర్లలో 23 పరుగులిచ్చి 3 వికెట్లను పడగొట్టింది.

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ



గుణదల(విజయవాడ తూర్పు): గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం ఉదయం సమష్టి దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేవుని పట్ల విశ్వాసం కలిగి, ఆయన కృపకు పాత్రులుగా జీవించాలన్నారు. భక్తులు దైనందిన జీవితంలో పాపానికి తావివ్వకుండా సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనుదినం బైబిల్ పఠనం, ప్రార్థనా విజ్ఞాపనల ద్వారా దేవుని ఆరాధించాలని పేర్కొన్నారు. చెడుకు దూరంగా ఉంటూ మంచి నడవడికతో ముందుకు సాగాలన్నారు. లోక రక్షకుడైన క్రీస్తు సమస్త మానవాళిని పరిరక్షించేందుకు శిలువ మరణం పొందారని వివరించారు. ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. దేవునికి విధేయులుగా నడుచుకోవడం ద్వారా సకల ఆశీర్వాదాలు లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యక్షేత్రానికి చేరుకుని, మరియమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రేపు విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు

విజయవాడ స్పోర్ట్స్: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఈ నెల 15వ తేదీన విజయవాడ నగరంలో పలు మార్గాల్లో వాహనాల రాకపోకలను దారి మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్న దృష్ట్యా బెంజిసర్కిల్ నుంచి ఆర్టీసీ వై జంక్షన్ వరకు ఎంజీ రోడ్డులో, రెడ్‌సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్ వరకు, శిఖామణిసెంటర్ నుంచి వెటర్నరీ జంక్షన్ వరకు కేవలం ఆహ్వానితుల వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. ఈ మార్గంలో ప్రయాణించాల్సి ఆర్టీసీ సిటీ బస్సులు, ఇతర వాహనాలు ఆర్టీసీ వై జంక్షన్ ఏలూరు రోడ్డు పుష్పా హోటల్, సిద్ధార్థ జంక్షన్ మీదుగా మార్గంగా, ఆర్టీసీ వై జంక్షన్, బందరు లాకులు, రాఘవయ్యపార్క్, పాత ఫైర్ స్టేషన్ రోడ్డు, అమెరికన్ ఆస్పత్రి, నేతాజీబ్రిడ్జి, గీతానగర్, స్క్యూబ్రిడ్జి, మీదుగా బెంజిసర్కిల్‌కు రాకపోకలు సాగించాలన్నారు.

ఆహ్వానితుల వాహనాల పార్కింగ్ ఇలా..

- ఏఏ పాస్‌లు కలిగిన వారు మూడో నంబర్ గేట్ నుంచి స్టేడియంలోకి ప్రవేశించి నిర్దేశించిన ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- ఏ1, ఏ2 పాస్‌లు కలిగిన వారు నాల్గో గేటు నుంచి ప్రవేశించి హ్యాండ్‌బాల్ కోర్టులో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- బీ1, బీ2 పాస్‌లు కగిలిన వారు, పురస్కార గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు రెండో నంబర్ గేటు నుంచి ప్రవేశించి ఫుట్‌బాల్ కోర్టులో, స్టేడియం ఎదురుగా ఉన్న సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
- పాస్‌లు కలిగిన ఆహ్వానితులను 7.45 లోపు మాత్రమే అనుమతిస్తారు.

మూడు గ్రామాల్లో వార్డు సభ్యులు ఏకగ్రీవం

నాదెండ్ల: మూడు గ్రామాల వార్డు సభ్యుల ఉప ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే రెండు గ్రామాల వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా, మూడో గ్రామం కూడా ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. ఇర్లపాడు, అమీన్‌సాహెబ్‌పాలెం స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కాగా రెండు ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఎండుగుంపాలెంలో వైఎస్సార్ సీపీ మద్దతుతో నలబోతుల మంగమ్మ, టీడీపీ బలపరచిన నలబోతుల కోటమ్మ నామినేషన్లు వేశారు. ఈ నెల 11న నామినేషన్లు పరిశీలించారు. కోటమ్మకు ఆరుగురు సంతానంతో, అనర్హతగా ప్రకటించారు. దీంతో కోటమ్మ కుమారుడు నరసరావుపేట ఆర్డీఓకు అప్పీలు చేయగా, అభ్యర్థురాలి సంతకం లేదని తిరస్కరించారు. దీంతో నలబోతుల మంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు.